నిలువ నీడ లేక అవస్థలు


కవిటం సెంటర్‌లో బస్ షెల్టర్లు లేక రోడ్డుపై నిలబడి ఉన్న ప్రయాణికులు


జిన్నూరు సెంటర్‌లో కానరాని బస్‌షెల్టర్‌లు

- గ్రామాల్లో కానరాని బస్‌షెల్టర్లు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు

పోడూరు: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు ప్రయాణించే సమయంలో బస్సు షెల్టర్లు లేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కవిటం సెంటర్‌లో బస్‌షెల్టర్లు లేక చాలా కాలంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. పాలకొల్లు, మార్టేరు వైపు ప్రయాణించేందుకు పోడూరు, కవిటం పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కడి నుంచే బస్సులు, ఆటోలు ఎక్కి వెళ్లాల్సి ఉంటుంది. గతంలో కవిటం సెంటర్‌లో రోడ్డు విస్తరణ పనులు చేసినపుడు మార్టేరు వైపు, పాలకొల్లు వైపు ఉన్న బస్‌షెల్టర్‌లను తొలగించారు. పోడూరు, కవిటం వైపు అంతకుముందు నుంచే బస్‌షెల్టర్‌లు లేవు. దీంతో ఈ సెంటర్ నుంచి ఎటువైపు ప్రయాణించాలన్నా ప్రయాణికులు రోడ్డుపై నిలబడి వేచి చూడాల్సి వస్తుంది. వేసవికాలంలో ఎండలోనూ, వర్షాకాలంలో వర్షంలో నిలబడి బస్సులు, ఆటోలు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలే కాకుండా పోడూరులోని కల్నల్ డీఎస్ రాజు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కూడా నిత్యం ఈ సెంటర్ నుండే రాకపోకలు సాగిస్తుంటారు. బస్‌షెల్టర్‌లు లేక వారంతా కూడా రోడ్డుపై నిలబడే వేచి చూడాల్సి వస్తుంది. రోడ్డు విస్తరణ పనులు చేసినపుడు అడ్డుగా ఉన్న చెట్లను కూడా తొలగించారు. దీంతో కనీసం ఏదైనా చెట్టు కిందైనా నిలబడే పరిస్థితి లేదని వాపోతున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు కష్టాలు చూసైనా పాలకొల్లు, మార్టేరు వైపు, కవిటం సెంటర్‌లో పోడూరు, కవిటం వైపు బస్‌షెల్టర్‌లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

జిన్నూరులో ఇలా

పాలకొల్లు–మార్టేరు రహదారి మార్గంలో జిన్నూరు సెంటర్ వద్ద మార్టేరు వైపు బస్‌షెల్టర్ లేక చాలా కాలంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మార్టేరు వైపు గతంలో ఉన్న బస్‌షెల్టర్‌ను నూతన వంతెన నిర్మించేందుకు అడ్డుగా ఉందని దాదాపు పదేళ్ల కిందట తొలగించారు. అప్పటి నుంచి ప్రయాణికులు, హైస్కూలు, కళాశాలల విద్యార్థులు బస్సులు, ఆటోల కోసం రోడ్డు పైనే నిలబడి ఉంటున్నారు. హైస్కూల్ వదిలాక సాయంత్రం సమయంలో మార్టేరు వైపు ఇంటికి వెళ్లేందుకు పెద్దసంఖ్యలో విద్యార్థులు ఇక్కడ రోడ్డు పక్కన నిలబడి ఉంటున్నారు. ఈ ప్రదేశంలో రోడ్డు మార్జిన్ కూడా పెద్దగా ఉండదు. దీంతో విద్యార్థులు రోడ్డు పక్కన ప్రమాదకర పరిస్థితుల్లో నిలబడుతున్నారు. పాలకొల్లు వైపు ఉన్న చిన్న బస్‌షెల్టర్‌ను ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల కోసం కొద్ది రోజుల కిందట తొలగించారు. అటు మార్టేరు వైపు, ఇటు పాలకొల్లు వైపు బస్‌షెల్టర్‌లు నిర్మించేలా అధికారులు కృషి చేయాలని పలువురు గ్రామస్తులు సూచిస్తున్నారు.

మండుటెండలో నిలబడాల్సిందే



కవిటం సెంటర్‌లో బస్సుల కోసం చూడాలంటే ఎండలో రోడ్డుపైనే నిలబడాలి. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు, విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారు. చాలాకాలంగా ఇక్కడ ఇదే దుస్థితి. బస్‌షెల్టర్ నిర్మాణానికి పెద్దగా నిధులు కూడా ఖర్చు కావు. కాబట్టి అధికారులు స్పందించి ప్రయాణికులకు నీడ కల్పించేలా బస్‌షెల్టర్‌ను నిర్మించాలి.

– బూరాబత్తుల వెంకట్రావు, పోడూరు

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



జిన్నూరు సెంటర్‌లో మార్టేరు వైపు బస్‌షెల్టర్ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వంతెన సమీపంలో ఉన్న జెడ్పీ హైస్కూల్లో వేడంగి, మట్టపర్రు గ్రామాలకు చెందిన విద్యార్థులు చాలామంది చదువుతున్నారు. వారు బస్సులు, ఆటోల్లో హైస్కూలు వస్తుంటారు. సాయంత్రం ఇంటికి వెళ్లేటపుడు రద్దీగా ఉండే ఈ సెంటర్‌లో రోడ్డు పక్కనే బస్సుల కోసం చాలాసేపు నిలబడి ఉంటున్నారు.

– మీసాల దాన వెంకట నర్సింహులు, జిన్నూరు

ఎస్సీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్లలోని ఎస్సీ బాలుర గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరాల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించినట్లు ప్రిన్సిపాల్ నల్లి సాయిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి మార్చి 6 వరకు దఖాఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్‌లు, కుల ధ్రువీకరణపత్రం, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99084 54667 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

దురుసుగా ప్రవర్తించిన నలుగురిపై కేసు నమోదు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయానికి వచ్చి కమిషనర్ ఎక్కడ ఉన్నారు? అని అడిగి, తనపై నలుగురు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించారని మేనేజర్ వెంకటేశ్వరరావు బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విధుల్లో ఉన్న వెంకటేశ్వరరావుపై ఎయిమ్స్ అనే సంస్థకు చెందిన దొడ్డి నాగరాజు, బండి మధు, బట్ట తిలక్‌లు విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు గురువారం విలేకరులకు చెప్పారు. నిందుతులను అరెస్టు చేశామని వివరించారు.

క్లుప్తంగా

అంతర్వేదిలో పర్యటించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


స్వామీజీకి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

నరసాపురం: వైఎన్ కళాశాలలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. ఈ శిబిరంలో భాగంగా గురువారం వలంటీర్లు అంతర్వేదిలో పర్యటించారు. లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. వశిష్ట ఆశ్రమాన్ని సందర్శించి, ప్రసాదరాజు గురూజీ ప్రవచనాలు ఆలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ, కళాశాల సామాజిక సేవా విభాగం కన్వీనర్ బి.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్.యాకోబ్, చింతా సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు నాయకులకు జిల్లా పదవులు


వినిస్టన్‌బాబు


బండి రమేష్

పాలకొల్లు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గంలోని పలువురు నాయకులకు జిల్లా స్థాయిలో పదవులు కల్పించారు. పార్టీకి అంకితభావంతో పని చేసినందుకు గుర్తించి పదవులు కల్పించారు. పాలకొల్లు మండలం పూలపల్లికి చెందిన న్యాయవాది కుంచిలపల్లి వినిస్టన్‌బాబుని క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. అలాగే పాలకొల్లు మునిసిపాలిటీ ఏడో వార్డు ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగానూ, పట్టణానికి చెందిన నాట్యాచార్యుడు పోకల వెంకటేశ్వరావు (వెంకన్న) కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సూచనల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సిఫార్సుతో వీరికి ఈ పదవులు లభించాయి.

వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి


ప్రసాదరాజును సత్కరిస్తున్న నాయకులు

కాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మన్నె నాగరాజు స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదు నూరి ప్రసాదరాజును వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మన్నె నాగరాజుయాదవ్ గురువారం ఆయన ఇతర నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని వారు నాగరాజు యాదవ్‌కు సూచించారు.కార్యక్రమంలో వీరమల్లు బోసు, మన్నె పోతురాజు, బొక్కా రాంబాబు, ధనుంజయ, శివనాగరాజు, చంద్రరావు, సింహాచలం, మన్నె శ్రీను, మందపాటి రవి, మన్నె సోమేష్, కళ్ళింపూడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్ట్ నిపుణుల బృందం పర్యటన

భీమవరం: భీమవరం పట్టణం, మండలంలోని గురువారం వివిధ పాఠశాలలను మండల స్థాయి సబ్జెక్ట్ నిపుణుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సబ్జెక్టు నిపుణులు సీహెచ్ వీర రాఘవ ప్రసాద్, కేసీహెచ్ సాయిరామ్, రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ టెస్ట్ క్లాస్ సీ, డీ గ్రేడ్ విద్యార్థులు తక్కువ సమయంలో ఏ విధంగా చదవాలో వివరించారు. పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు నూరు శాతం విద్యార్థులు హాజరై మంచి ఫలితాలను సాధించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడానికి కావాల్సిన పఠనా నైపుణ్యాలు, వ్యాకరణాంశాలు, గణితంలో గ్రాఫ్ వంటి ముఖ్యమైన విషయాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టి.అప్పన్న, టి.నమ్మాళ్వార్, సీహెచ్ శ్రీనివాస్, జె.శ్రీనివాసరావు, జి.సుకుమార్, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వీరవాసరం: స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మట్టా వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ బలరామరాజు గురువారం తెలిపారు. అతని వద్ద నుంచి 6 మద్యం (180 ఎంఎల్) బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

9న వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఊర్మిళ

నరసాపురం రూరల్: వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవాన్ని ఈ నెల 9వ తేదీ నరసాపురం మండల న్యాయసేవాధికార సంస్థ, కార్మిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ ఊర్మిళ, పాలకొల్లు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శర్మ లు పేర్కొన్నారు. గురువారం మొగల్తూరు పంచాయతీలో కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ప్యానల్ న్యాయవాదులు దొంగ నరసింహరాజు, ధనాల చాముండేశ్వరి పాల్గొని చట్టాలపై అవగాహన కలిగించారు. 1976లో వచ్చిన వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా పనిలో నియమించరాదని, శుభ్రమైన మంచినీరు, వారాంతపు సెలవు దినం తప్పనిసరిగ్గా ఉండాలన్నారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు డి.వరలక్ష్మి, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


కమిషనర్‌కు మందులు అందిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

నరసాపురం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10న పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోను, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. నులిపురుగుల మాత్రల పంపిణీపై గురువారం కమిషనర్ తన ఛాంబర్‌లో ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలు దాటిన పిల్లలకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలో పిల్లలు కచ్చితంగా మాత్రలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశావర్కర్ల సాయంతో మందుల పంపిణీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.మోహన్, డాక్టర్ సోనియా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పాత్రుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఏనుగువానిలంక హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: ఏనుగువానిలంక హైస్కూల్ ఉపాధ్యాయులు తయారు చేసిన కొబ్బరి వ్యర్థాలతో విద్యుత్ తయారీ పరికరం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై దక్షిణ భారతస్థాయి పోటీలకు వెళ్లింది. ఈ ప్రదర్శనను దక్షిణ భారత దేశ స్థాయికి తీసుకెళ్లడంలో ప్రధాన పాత్ర వహించిన పాఠశాల ఉపాధ్యాయులు ముద్దల శ్రీరామాంజనేయరావు, దేశిసీడి వీర వెంకట ఆది నారాయణ దంపతులను గురువారం హైస్కూల్‌లో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు కలసి ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ నారిన వెంకట రామకృష్ణారావు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు మరిన్ని ప్రాజెక్టులు చేపడితే తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈద ప్రమీల, పొత్తూరి రామాంజనేయరాజు, వినుకొండ రమేష్, పొత్తూరి వెంకట్రాజు, హెచ్ఎం సొంటి అవధాని, మేడపాడు మాజీ సర్పంచ్ అడ్డాల వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతోనే మంచి ఫలితాలు


చినమల్లంలో ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పెనుగొండ: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. గురువారం పరిశోధన స్థానం దత్తత గ్రామమైన చినమల్లంలో ఎలుకల యాజమాన్యంపై ఎలుకల విభాగ శాస్త్ర వేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.ఆనందకుమార్‌లు రైతులకు అవగాహన కల్పించారు. సీజన్ బట్టి ఒక్కో రైతు ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఎలుకల నిర్మూలనకు ఖర్చు పెడుతున్నారన్నారు. దీనిని అధిగమించడానికి బ్రోమోడైయలోన్ ఎర మందు పెట్టుకోవడం, ఎర–తెర పద్ధతి వంటి పర్యావరణ హితమైన పద్ధతులను రైతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.స్పందన, శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ కృష్ణాజి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి


ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

భీమవరం: ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలను ఫిబ్రవరి 7న భీమవరంలో నిర్వహిస్తారని, ఈ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలో జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యా రంగంలోని సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటానికి శ్రీకారం చుడుతూ ప్రణాళిక సిద్ధం చేయడానికి మహాసభల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బీజేపీ విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు 7 నెలలు గడిచిపోయినా పాఠశాల విద్యార్థులకు తల్లివందనం ప్రస్తావనే లేదని మండిపడ్డారు. పేద మధ్య తరగతి విద్యార్థులు విద్య అభ్యసిస్తున్న సంక్షేమ హాస్టల్లో ఆరేడు నెలలుగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయలేదన్నారు. విద్యార్థి సమస్యలపై చర్చించే మహాసభల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్, కార్యదర్శి బి.గణేష్ ఉపాధ్యక్షులు చిన్నం శాంతి, డి.సింధు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లను ఎదగనిద్దాం-చదవనిద్దాం


పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ ఇందిర


పెనుగొండ: కొడమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: ఆడపిల్ల చదువుకుంటే సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని, ఉద్యోగం చేసి కుటుంబ బాధ్యతలు మోస్తుందని ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆడపిల్లను ఎదగనిద్దాం-ఆడపిల్లను చదివిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఈ సందర్భంగా బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.భాగ్యలక్ష్మి, జి.జనార్ధనరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, హెచ్‌వీ బి.కమలమ్మ పాల్గొన్నారు.

కొడమంచిలిలో..

పెనుగొండ: బాల్య వివాహాలపై అవగాహనతో ఉండాలని పెనుమంట్ర సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. కొడమంచిలి చిన్న పేట గ్రామంలో గర్భిణుల నమోదు కార్యక్రమం, బేటి బచావో–బేటి పడావో కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణులు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌డీ సూపర్‌వైజర్ సూర్యకుమారి, హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

పదిలమైన ఫలితాలే లక్ష్యం


యలమంచిలి మండలం దొడ్డిపట్ల హైస్కూల్‌లో పదో తరగతి స్పెషల్ క్లాసులో చదువుతున్న విద్యార్థులు

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెచ్చిన సంస్కరణల ఫలితం
- ఒత్తిడి లేకుండా చదువుతున్న విద్యార్థులు

యలమంచిలి: ప్రభుత్వ విద్యా విధానంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. అందులో ముఖ్యమైనది పదో తరగతి పరీక్షల పద్ధతి మార్పు. రెండేళ్ల క్రితం వరకు పది పరీక్షలను 11 రోజుల పాటు 11 పేపర్లుగా నిర్వహించేవారు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒత్తిడికి గురయ్యేవారు. ముఖ్యంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థుల్లో ఆందోళన అధికంగా ఉండేది. దీన్ని నివారించేందుకు నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరు సబ్జెక్టులను ఏడు పేపర్లుగా మార్చింది. దీంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గింది. ఈ ఏడాది కూడా అదే విధానాన్ని అనుసరిస్తూ ప్రతి పరీక్షకూ ఒక రోజు చొప్పున విరామం ఇచ్చారు. మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 565 మంది, రెండు ప్రైవేట్ పాఠశాలల నుంచి 30 మంది మొత్తం 595 మంది విద్యార్థులు ఈ ఏడాది పది పరీక్షలు రాయనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

గతంలో ఇలా..

పదో తరగతి పరీక్షలు చాలా సంవత్సరాల పాటు 11 పేపర్లు నిర్వహించారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకూ 50 మార్కులు చొప్పున రెండు పేపర్ల ప్రకారం నిర్వహించారు. కరోనా ప్రభావంతో 2019–20, 2020–21 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021–22 విద్యా సంవత్సరంలో 11 పేపర్లను 7 పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టులలో ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున, ఫిజిక్స్, బయాలజీ పేపర్లకు ఒక్కో పేపర్‌కు 50 మార్కుల చొప్పున నిర్దేశించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న విధానానికి స్వస్తి పలకడంతో విద్యార్థుల పై ఉండే పబ్లిక్ పరీక్షల ఒత్తిడి భారం తగ్గింది.

నూతన విధానం ఇలా

2022–23 విద్యా సంవత్సరంలో పది పరీక్షలను ఏడు పేపర్లుగా కుదించారు. ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులు కేటాయించారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులలో ఒకే ప్రశ్నపత్రాన్ని ఇచ్చారు. జవాబు మాత్రం వేర్వేరు సమాధాన బుక్‌లెట్లలో రాయాల్సి ఉంటుంది. గత విద్యా సంవత్సరంలో మూల్యాంకనం చేసేందుకు వీలుగా రెండు పేపర్లు ఇచ్చేవారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి పరీక్షలపై ఉండే భయాన్ని పోగొడుతుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షల్లో కూడా ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలు నిర్వహించనున్నారు.

మార్చి 17 నుంచి పరీక్షలు

ఇప్పటికే ప్రభుత్వం పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రతి పరీక్షకూ మధ్య ఒక రోజు విరామం ఇచ్చారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 17న తెలుగుతో పరీక్షలు ప్రారంభమవుతాయి. 19న హిందీ, 21న ఇంగ్లిష్, 24న లెక్కలు, 26 ఫిజికల్ సైన్స్, 28న బయాలాజికల్ సైన్స్, 31న సోషల్ పరీక్షతో పరీక్షలు పూర్తవుతాయి.

ఒత్తిడి తగ్గి బాగా చదువుకోవచ్చు



ప్రస్తుతం పదో తరగతి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి పరీక్షలు బాగా రాసే అవకాశాలు ఉన్నాయి. ప్రతి పరీక్షకూ మధ్య సెలవు రావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగం. ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించి, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. నూతన విధానం వల్ల పరీక్షల సంఖ్యతో పాటు, విద్యార్థులపై భారం తగ్గుతుంది.

– కనుమూరు వెంకట రామకృష్ణంరాజు, ఎంఈఓ, యలమంచిలి

ఎన్నికల కోడ్ అమలు అపహాస్యం


పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఫ్లెక్సీ

ఎన్నికల నిబంధనలను తప్పకుండా అమలు చేయాల్సిన అధికారులు పెనుమంట్ర మండలంలో వాటికి పాతరేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి నాలుగు రోజులు అవుతున్నా పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను నేటికీ తొలగించలేదు. రోజూ కార్యాలయానికి వచ్చే తహసీల్దార్‌కు కూడా ఫ్లెక్సీ కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాక్షాత్తు ఎన్నికల నియమ నిబంధనలు అమలు చేయాల్సిన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ఫ్లెక్సీను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

– పెనుమంట్ర